సులువుగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి



మెదక్‌జోన్: చలివణికిస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో జీర్ణశక్తి మందగిస్తుందని, దీంతో పాటు ఇమ్యూనిటీ సైతం తగ్గుతుంది. ఈ నేపథ్యంలో సులువుగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. రోజువారి ఆహారంలో తాజా కూరగాయలు, పండ్లు, ఎండు ఫలాలు, పాలు, గింజధాన్యాలు, ఆకుకూరలు, నెయ్యి, వంటివి ఆహారంలో తీసుకుంటే జీర్ణశక్తిని పెంచుతాయి. చలిగాలికి బద్ధకం, అధికనిద్ర కూడా అజీర్తికి కారణం. ఇందుకోసం శరీరం లోపల నుంచి వెచ్చదనం అందించే ఎండుఫలాలు, గింజలు, పప్పులు, నువ్వులు, వంటి వాటికి ప్రధాన ఉపయోగపడతాయి. అలాగే మాంసం, చేపలు, తృణధాన్యాలతో పాటు ప్రొటీన్లు, కొవ్వుపదార్థాలు ఉన్న ఆహారం క్యారెట్, బంగాళదుంప, ఉల్లి, వెల్లుల్లి, ముల్లంగి, పాలకూర, మెంతికూర, వంటి పోషక విలువ ఉండేవాటిని తీసుకుంటే శరీరానికి ఈ చలికాలంలో ఆరోగ్యాన్ని కాపాడుతాయి. అలాగే ఆవాలు, ఇంగువ, మిరియాలు, మెంతులు, వాము, వంటి సుగంధ ద్రవ్యాలు దగ్గు, జ్వరం, జలుబు, వంటి సీజనల్ ఇన్‌ఫెక్షన్లు రాకుండా అరికడతాయి. రక్తప్రసరణను కూడా మెరుగు పరుస్తాయి. వీటిని ప్రతిరోజు ఆహారంలో ఏదో విధంగా చేర్చుకుంటే మంచిది.



– డాక్టర్ పెంటాగౌడ్, జనరల్ ఫిజీషియన్(ఎండీ)

జంతువులకు శ్వాసకోశ సమస్యలు



మెదక్ కలెక్టరేట్: శీతాకాలంలో పెంపుడు జంతువులకు న్యుమోనియా వంటి శ్వాసకోశ వ్యాధులతో పాటు ఇతర చర్మ వ్యాధులు వచ్చే అవకాశం అధికంగా ఉంటుంది. ప్రస్తుతం చలి తీవ్రత పెరిగిన సమయంలో పెంపుడు జంతువులు చల్లని వాతావరణం ఉండటంతో శరీర ఉష్ణోగ్రతలు పడిపోతాయి. ఫలితంగా జంతువుల్లో వణుకు, బలహీనత, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి. కోళ్ల ఫాంల్లో కోళ్లు ఎక్కువగా ఉంటాయి కాబట్టి చలిని తట్టుకునేందుకు ఫాం చుట్టూ గొనె సంచులు కట్టాలి. అలాగే కోళ్ల కింద వరి పొట్టు వేయడం వల్ల కోళ్లు వెచ్చగా ఉండి అనారోగ్యాలకు గురికాకుండా ఉంటాయి. పెంపుడు జంతువులకు చలిని తట్టుకునేందుకు గోరువెచ్చని నీరు ఇవ్వాలి. ఫలితంగా చలిని తట్టుకొని వెచ్చగా ఉంటాయి. మేకలు, గొర్రెలు షెడ్లు, పశువుల పాకలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. పాకల చుట్టూ గొనె సంచులు వేసి వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. బలవర్ధకమైన పదార్థాలు అందించాలి. పెంపుడు పశువులకు ఎండుగడ్డి, దాణ అప్పుడే పుట్టిన దూడలను వెచ్చటి నీళ్లు, పాలు అందించాలి.



– జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య

క్లుప్తంగా

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

చేగుంట(తూప్రాన్): కామ్రేడ్ కేవల్ కిషన్ వర్ధంతి సందర్భంగా పొలంపల్లి జాతరను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్ నందకిషోర్ జేఏసీ నాయకుడు సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని పొలంపల్లి శివారు కేవల్‌కిషన్ సమాధి వద్ద ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నందకిషోర్ మాట్లాడుతూ.. ఈనెల 26న కేవల్ కిషన్ 64వ వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆవిష్కరణలో భిక్షపతి, నాగభూషణం, రామస్వామి, రఘుపతి, లోక్‌సత్తా నర్సింలు, అంజనేయులు, గణేశ్ రవికుమార్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

వైభవంగా మహాగణపతి ఆలయ ఉత్సవాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో వెలసిన శ్రీ మహాగణపతి పంచాయతన ఆలయ తృతీయ వార్షికోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్తలు సిందూరి హన్మంతరావు, ఉదయ్ భాస్కర్ దంపతుల ఆధ్వర్యంలో మహాగణపతి ఆలయంలో అభిషేకం, నవ గ్రహ పూజలు, గణపతి హోమం, శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దశంకరంపేట(మెదక్): రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింలు అన్నారు. బుధవారం రిటైర్డు ఉద్యోగుల దినోత్సవం సందర్భంగా మండల కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన రిటైర్డు ఉద్యోగులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం ద్వారా నిర్వహించే కార్యక్రమాలు, చేపట్టబోయే పనుల గురించి సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బి.నారాయణ, కొత్త ప్రభులు, పురుషోత్తం, మోహన్, సుభాష్, సంగారెడ్డి తదితరులు ఉన్నారు.

కనులపండువగా సుబ్రమణ్యస్వామి కల్యాణం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని భస్వాపూర్ మల్లన్నగుట్టపై వెలసిన శ్రీభ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి దేవాలయం వద్ద బుధవారం శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన పూజలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఉత్సవాలకు హాజరైన భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

తాగునీటి కేంద్రం ఏర్పాటు

తూప్రాన్: నీటిశుద్ధి కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు చిట్కుల మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఘణపూర్‌లో గ్రామానికి చెందిన వెంకటేశం తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు.

కార్మికులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాగరాజు

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామపంచాయతీ కార్మికులకు చందంపేట గ్రామానికి చెందిన ఎర్రవల్లి పద్మ, గరాజు దంపతులు దుప్పట్లు పంపిణీ చేశారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో 15 మంది కార్మికులకు దుప్పట్లను అందించారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

తూప్రాన్: రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మున్సిపల్ కేంద్రంలో రైతు ఆగ్రోస్ సేవాకేంద్రం–2 బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులతో పాటు విత్తనాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మార్టిగేజ్ భూమిలో రోడ్డు నిర్మాణం



వెంచర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

నర్సాపూర్: మున్సిపాలిటీకి మార్టిగేజ్ చేసిన భూమిలో ఓ వెంచర్ యాజమాన్యం రోడ్డు నిర్మిస్తుంది. నర్సాపూర్ – వెల్దుర్తి రహదారిని ఆనుకొని స్వర్ణధామ డెవలపర్స్ సంస్థ సుమారు 30 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు చేసింది. కాగా వెంచర్ భూమిలో నిబంధనల మేరకు 800 చదరపు గజాల భూమిని వెంచర్ యాజమాన్యం మున్సిపాలిటీకి మార్టిగేజ్ చేశారు. కాగా మార్టిగేజ్ చేసిన భూమిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టరాదన్న నిబంధనలను ఉల్లంఘించి, వెంచర్ యాజమాన్యం పలు నిర్మాణ పనులు చేపడుతున్నారు. గతంలో ఈ వెంచర్‌కు ఎంట్రెన్స్ కమాన్ నిర్మాణ పనులు చేపట్టగా.. మున్సిపాలిటీ అధికారులు పనులు నిలిపివేయాలని నోటీసులు ఇచ్చారు. దీంతో నిర్మాణ పనులు నిలిపివేశారు. తాజాగా నర్సాపూర్ వెల్దుర్తి రోడ్డు నుంచి వెంచర్‌లోకి వెళ్లేమార్గంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి, మట్టితో రోడ్డు ఏర్పాటు చేశారు. కాగా ఎంట్రెన్స్ నుంచి ఏర్పాటు చేసిన మట్టి రోడ్డుపై ఒక వైపు సిమెంట్ రోడ్డు నిర్మించే పనులు చేస్తున్నారు.

నిర్మాణాలు చేపట్టొద్దు

మున్సిపాలిటీకి మార్టిగేజ్ చేసిన భూమిలో వెంచర్ యాజమాన్యం ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్) ప్రభాకర్ చెప్పారు. గతంలో నోటీసులు ఇవ్వగా ఎలాంటి పనులు చేపట్టమని హామీ ఇచ్చారని ఆయన చెప్పారు. తాజాగా స్వర్ణధామ వెంచర్‌లో సీసీ రోడ్డు నిర్మిస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. తన దృష్టికి రాలేదని, ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నిబంధనలు ఉల్లంఘించలేదు

తమ వెంచర్‌లో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించలేదని స్వర్ణధామ డెవలపర్స్ వెంచర్ మేనేజింగ్ డైరెక్టర్ రాఘవేందర్‌రావు చెప్పారు. తాము మున్సిపాలిటీకి కొంత భూమిని మార్టిగేజ్ చేశామని, రోడ్ల కోసమే మార్టిగేజ్ చేశామని, అదే స్థలంలో రోడ్డు నిర్మిస్తున్నామని, ఎక్కడ నిబంధనలు ఉల్లంఘించలేదని ఆయన వివరించారు.

గతంలోనే నోటీసులు ఇచ్చాం



వెంచర్‌లో మున్సిపాలిటీకి మార్టిగేజ్ చేసిన భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని సెప్టెంబరులో వెంచర్ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చాం. సీసీ రోడ్డు నిర్మిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపి విచారణ చేయించి తగిన చర్యలు తీసుకుంటాం.

– మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

ప్రభుత్వ భూమిని కాపాడాలి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న శివారులో ప్రభుత్వ భూమిని కాపాడాలని మాజీ సర్పంచ్ రాజేందర్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. వెల్మకన్న సమీపంలోని సర్వేనంబర్ 471లో పలువురు రైతులు అక్రమంగా స్థలం కబ్జా చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు లేక ప్రజలు చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని ఆ సర్వేనంబర్లలోని భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. కౌడిపల్లిలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి స్థలం లేదని, ఇక్కడ కేటాయించి డిగ్రీ కళాశాల నిర్మించాలని లేదా ఇతర ప్రభుత్వ భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు స్పందించి కబ్జాను అడ్డుకోవాలని కోరారు.



వెల్మకన్న శివారులో కబ్జాకు గురవుతున్న స్థలం

బాల్యవివాహాలు లేని గ్రామంగా మారుద్దాం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విజన్ –ఏ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో బాల్య వివాహాలు లేని గ్రామంగా మార్చాలని పాఠశాల హెచ్‌ఎం పద్మారెడ్డి సూచించారు. ఈ మేరకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్యవివాహాలు లేని, బాల కార్మికులు లేని, బాలల అక్రమ రవాణా లేని సమాజాన్ని రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కమ్యూనిటీ మొబిలైజర్ యాదగిరి, పాఠశాల ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేష్, చంద్రకాంత్, కుమారస్వామి, షాదుల్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ధాన్యం డబ్బులు తక్కువగా వచ్చాయి

రైతుల ఆందోళన

చిన్నశంకరంపేట(మెదక్): ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటా చేసిన ధాన్యం డబ్బులు తక్కువగా వచ్చాయని నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. తాము కాంటా చేసిన ధాన్యం లెక్కలు తారుమారు అయ్యాయని, తమకు క్వింటాల్ ధాన్యం తక్కువగా రాసి, ఒక్కొక్కరికీ వెయ్యి నుంచి రెండు వేల వరకు డబ్బులు తక్కువగా వచ్చాయన్నారు. కాంటా చేసినప్పుడు ఇచ్చిన రశీదు ఉన్నప్పటికీ రైతులకు ఒక్కో బస్తా ధాన్యం డబ్బులు తక్కువగా ఖాతాలో జమ చేశారన్నారు. ఇదే విషయంపై ఐకేపీ ఏపీఓ అశోక్, సీసీ సుల్తానను అడిగిన స్పందనలేదన్నారు. ఉన్నత అధికారులు విచారించి రైతుకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు ఇళ్ల శ్రీనివాస్, పోకల మధు, నర్సింలు, దుర్గయ్య, ఆశోక్, సిద్ధిరాములు, బాలమల్లు, బాలయ్య తదితరులు ఉన్నారు.



నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు.

బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ లేక ఇబ్బందులు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వ రంగసంస్థ బీఎస్ఎన్ఎల్ మొబైల్ సిగ్నల్ లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం మండల కేంద్రం కౌడిపల్లికి చెందిన రాగుల భూమయ్యతో పాటు పలువురు వినియోగదారులు మాట్లాడుతూ.. నెలరోజులుగా బీఎస్ఎన్ఎల్ సెల్‌ఫోన్ సిగ్నల్ సరిగాలేదన్నారు. ఒకసారి వచ్చిన రోజుల తరబడి సిగ్నల్ రావడం లేదన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నైపుణ్యత ప్రదర్శించాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రతీ విద్యార్థిలో నైపుణ్యత ఉంటుందని, దాన్ని వెలుగులోకి తీసుకురావాలని ఉపాధ్యాయులకు హెచ్‌ఎం బాలచంద్రం సూచించారు. బుధవారం మండల కేంద్రమైన శివ్వంపేటలోని ఉన్నత పాఠశాలలో ముందస్తు గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగోళి గణితంతో పాటు వివిధ ప్రయోగాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సమాజంలో చదువుకు ఉన్న ప్రాధాన్యత మరేదానికి లేదన్నారు. ఏకాగ్రతతో చదివి, అనుకున్న లక్ష్యం వైపు ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

వైభవంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

టేక్మాల్(మెదక్): మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామంలో ప్రసన్నాంజనేయ దేవాలయాల వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు. ఉత్సవానికి ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుస్తుంపేట పీఠాధిపతి రాజయోగి వెంకటస్వామి ఆశీస్సులు అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

శివ్వంపేట(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా జరుగుతోంది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న ఇంటింటి సర్వేను బుధవారం ఎంపీడీఓ నాగేశ్వర్ గుప్తా, ఎంపీఓ తిరుపతిరెడ్డి పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండల వ్యాప్తంగా 11 వేల 721 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని వారికి సంబంధించి వివరాలు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో సిబ్బంది నమోదు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు 1200 డేటా ఎంట్రీ పూర్తి చేశారని నెలఖారు వరకు డేటా ఎంట్రీ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

వెల్మకన్నలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. వెల్మకన్నలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి దరఖాస్తుదారుల ఇంటికి వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో సర్వే వివరాలు నమోదు చేశారు. కాగా అన్ని గ్రామాల్లో సర్వే పనులు చేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల తెలిపారు.

కొర్విపల్లిలో..

చిన్నశంకరంపేట(మెదక్): ఇళ్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకే ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి రామ్‌చంద్రం అన్నారు. మండలంలోని కొర్విపల్లిలో గ్రామ కార్యదర్శి సమత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు.



చిన్నశంకరంపేట(మెదక్): ఇళ్ల సర్వేలో పాల్గొన్న కాంగ్రెస్ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి రామ్‌చంద్రం



శివ్వంపేట(నర్సాపూర్): శభాష్‌పల్లిలో డేటా ఎంట్రీ చేస్తున్న కార్యదర్శి

వేలం సొమ్ము వసూలులో జాప్యం

నర్సాపూర్: సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) బకాయిలు వసూలు చేసేందుకు ఆర్ఆర్ యాక్ట్ కింద ఆస్తులను వేలం వేసిన అధికారులు వేలం ద్వారా రావాల్సిన సొమ్మును వసూలు చేయడంలో జాప్యం చేస్తున్నారు. నర్సాపూర్‌కు చెందిన ఓ రైసు మిల్లు యజమాని సీఎంఆర్ కింద ప్రభుత్వానికి బకాయి పడగా, అతని నుంచి బకాయి సొమ్ము వసూలు చేసేందుకు అతని ఆస్తుల్లో ఇల్లు, వాహనాలు, రైస్‌మిల్లు, వ్యవసాయ భూమిని పలు దఫాలుగా వేలం వేశారు. కాగా సెప్టెంబరు 25న వ్యాపారికి మండలంలోని నారాయణపూర్‌లో ఉన్న 71 గుంటల భూమిని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వేలం వేయగా, హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఆ భూమిని రూ.రెండు కోట్ల 12లక్షల 50వేలకు దక్కించుకున్నారు. వేలంలో భూమిని పొందిన వ్యక్తి వేలం సొమ్మును నెల రోజులలోపు చెల్లించాల్సి ఉండగా, ఇంత వరకు పూర్తి సొమ్మును ప్రభుత్వానికి చెల్లించక పోవడం గమనార్హం. వేలంలో పాల్గొనేందుకు కాషన్ డబ్బులు రూ.పది లక్షలు చెల్లించడంతో పాటు వేలం జరిగిన నాటి నెల రోజులలోపు రూ.42లక్షలు చెల్లించాడు. అనంతరం పలు వాయిదాల్లో సొమ్మును చెల్లించినా.. పూర్తి సొమ్మును చెల్లించలేదు. నిబంధనల మేరకు సొమ్మును చెల్లించకపోయినా అతనిపై అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. వేలంలో భూమిని పొందిన వ్యక్తి ప్రభుత్వానికి 59లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. వేలంలో భూమి పొందిన వ్యక్తి కుటుంబ సభ్యులు అస్వస్థతకు గురైనందున కొంత గడువు కావాలని ఉన్నతాధికారులను అడిగారన్నారు. ప్రభుత్వానికి రావాల్సిన సొమ్ము వసూలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

జాతీయ రహదారి పనులు ప్రారంభం

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రంలో నిలిచిన రోడ్డు పనులతో ఇబ్బందులు పడుతున్న విషయంపై జాతీయ రహదారి పనుల్లో జాప్యం ఎందుకు? అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు బుధవారం ఎట్టకేలకు పనులు ప్రారంభించారు. మూడు జేసీబీలతో పనులను చకచకా కొనసాగిస్తున్నారు. గతంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించక ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెల్సిందే. ఈ విషయంపై పలువురు ప్రయాణికులు మండిపడ్డారు. దీంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి పనులను ప్రారంభించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి ఎఫెక్ట్



జేసీబీతో రోడ్డు పనులను చేస్తున్న సిబ్బంది

డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రతీ ఒక్కరు డ్రగ్స్ నిర్మూలనకు సిద్ధంగా ఉండాలని ఎస్ఐ నారాయణగౌడ్ కోరారు. బుధవారం చిన్నశంకరంపేట మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపాల్ లింగం పాల్గొన్నారు. అలాగే నార్సింగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శంకర్‌గౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణగౌడ్

సంక్షిప్త వార్తలు

◆ **నోట్‌బుక్స్ పంపిణీ**

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిప్పల్‌తుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, పెన్నులు, ఇతర స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు దేవాగౌడ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



◆ **వీఎస్టీ పరిశ్రమలో యూనియన్ ఎన్నికలు**

మనోహరాబాద్(తూప్రాన్): వీఎస్టీ పరిశ్రమలో యూనియన్ ఎన్నికల హడావిడి ప్రారంభమైంది. బుధవారం మండలంలోని ముప్పిరెడ్డిపల్లి, కొండాపూర్ శివారులోని వీఎస్టీ లిమిటెడ్ పరిశ్రమలో ఈ ఎన్నికలు ఈ నెల 28న ఎన్నికలు జరగనున్నాయని కార్మికులు తెలిపారు. ఇందులో భాగంగా ఎస్ఎస్ రెడ్డి గ్రూప్ తరపున యూనియన్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డి కార్మికులతో కలిసి భారీ ర్యాలీ చేపట్టి, సంగారెడ్డి తరలి వెళ్లి లేబర్ కమిషన్ కార్యాలయంలో నామినేషన్ వేశారు.

◆ **ఆర్థిక చేయూత కోసమే స్త్రీనిధి రుణాలు**

చిన్నశంకరంపేట(మెదక్): స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకే స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తున్నట్లు మెదక్ స్త్రీనిధి బ్యాంకు రిజియన్ మేనేజర్ గంగరామ్ తెలిపారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో తనిఖీ చేసిన ఆయన మండలంలోని జంగరాయి, కొర్విపల్లి, కామారం తండాలో స్త్రీనిధి రుణాలు పొందిన లబ్ధిదారుల నుంచి రికవరీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రూ.78 కోట్ల రుణాలు అందించాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్నట్లు తెలిపారు. ఇప్పటికి 36 కోట్ల రుణాలు అందించామన్నారు.

◆ **ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి**

మెదక్ కలెక్టరేట్: ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని, వారి న్యాయమైన కోరికలు వెంటనే పరిష్కరించాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో ఈనెల 20న జిల్లాలో జరిగే బస్సుజాత కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్సుజాత కొనసాగుతుందని తెలిపారు. ఈనెల 20న బస్సుజాత మెదక్ జిల్లా కేంద్రానికి రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభలో ఆశావర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకురాళ్లు స్వప్న, సావిత్రి, శోభ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి**

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో పలు అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల గుర్తింపు పారదర్శకంగా ఉండాలని, ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలన్నారు. వార్డు అధికారులు తమ వార్డు ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. కాగా మేనేజర్ మధుసూదన్ పట్టణంలో కొనసాగుతున్న కార్యక్రమాలను చైర్మన్‌కు వివరించారు.

విద్యార్థులకు తపస్ ఆర్థికసాయం

పాపన్నపేట(మెదక్): నేషనల్ బాలరంగ్ ఫెస్టివెల్ ప్రోగ్రాంకు భోపాల్ వెళ్తున్న విద్యార్థులకు బుధవారం పాపన్నపేటలో విద్యావేత్త సుధాకర్‌రెడ్డి ఇచ్చిన రూ.10 వేల చెక్కును తపస్ యూనియన్ నాయకుడు నర్సింలు అందజేశారు. ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే ఫెస్టివెల్‌లో పాపన్నపేట విద్యార్థులు పాల్గొననున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దుర్గాప్రసాద్, ప్రసాద్‌రెడ్డి, ప్రవీణ్, అంజాగౌడ్, కృష్ణకాంత్, ఇందిర, కవిత తదితరులు ఉన్నారు.

◆ **సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన**

మెదక్ కలెక్టరేట్: మెదక్ సమీకృత కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 9వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆడుతూ నిరసన తెలిపారు.